శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సదాశివపేట, ఫిబ్రవరి 12: పట్టణంలోని శంభులింగేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం శంభులింగేశ్వర ఆలయంలో ముద్దనాగ్ నాథ్ ఆధ్వర్యంలో శివ మహాపడి పూజ నిర్వహించారు. మహాపడి పూజకు హాజరైన ఎమ్మెల్యే పర మశివుడికి ప్రత్యేక పూజలు చేసి దర్శించు కున్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కాసాల బుచ్చిరెడ్డి, ముద్ద నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అండగా బీఆర్టీయూ

జిన్నారం ఫిబ్రవరి 12: బొల్లారం పారిశ్రామికవాడలోని రెడీమిక్స్ డ్రైవర్లకు బీఆర్టీయూ నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అండగా నిలిచారు. పారిశ్రామికవాడలోని ధనలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కొన్నేండ్లుగా డ్రైవర్లుగా బీహార్‌కు చెందిన ఉదయ్, ఆసీస్ పని చేస్తున్నారు. అకారణంగా పనుల నుంచి తీసివేసి, రావాల్సిన వేతనం ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని వారు రవిసింగ్‌ను ఆశ్రయించారు. యాజమాన్యంతో చర్చించి డ్రైవర్లకు రావాల్సిన మూడు నెలల వేతనాన్ని బుధవారం డ్రైవర్లకు అందించారు. సమస్య పరిష్కరించిన కార్మిక నాయకుడికి డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు స్థానికులు అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు ఉన్నారు.

లైంగికదాడి కేసులో శిక్ష

కోహీర్, ఫిబ్రవరి12:మండలంలోని మనియార్‌పల్లికి చెందిన మైనర్(17)పై లైంగిక దాడికి యత్నించడంతో యువకుడికి మూడేండ్ల జైలు శిక్ష పడిందని ఎస్సై సతీశ్‌వర్మ బుధవారం వెల్లడించారు.ఎస్సై కథనం ప్రకారం..వికారాబాద్ జిల్లా కోటమర్పల్లి గ్రామానికి చెందిన బేగరి ఆంజనేయులు 2021, ఫిబ్రవరి 1న మనియార్‌పల్లిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చెల్లా రాజశేఖర్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జిల్లా కోర్టు జడ్జి జయంతి తీర్పును వెలువడించారు. ఆంజనేయులుకు మూడేండ్ల జైలు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పు చెప్పారు. శిక్ష పడేందుకు కృషి చేసిన ఎస్సైలు రాజశేఖర్, సతీశ్‌వర్మ, న్యాయవాది సూర్ రెడ్డి, భరోసా లీగల్ పర్సన్ సౌజన్య, హెడ్ కానిస్టే బుళ్లు చంద్రశేఖర్, వెంకటేశ్వర్, శంకర్, సత్యనారాయణను ఎస్పీ రూపేశ్ అభినందించారు.

చెత్త వేస్తే కఠిన చర్యలు

జిన్నారం ఫిబ్రవరి 12: రోడ్లపై ఇష్టారాజ్యంగా చెత్త, ఇతర వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొల్లారం మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. బుధవారం వారాంతపు మార్కెట్ జరిగే ప్రదేశంలో నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త, ఇతర వ్యర్థాలు వేసిన వారికి మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ మందలించారు. ఖాళీ, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం గానీ, నిషేధిత ప్లాస్టిక్ కవర్స్ వాడడం గానీ చేయవద్దంటూ అవగాహన కల్పించారు. స్వచ్ఛత చర్యలకు ప్రతిఒక్కరూ విధిగా సహకరించాలని సూచించారు.

తాళాలు పగులగొట్టి చోరీ

హత్నూర, ఫిబ్రవరి12: ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన హత్నూర మండలం తాహేర్కాన్‌పేటలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లేశం కుటుంబసభ్యులతో కలిసి బ్యాతోల్‌లో జరిగే జాతరకు వెళ్లారు. మంగళవారం పొరుగింటి వాళ్లు మూడగా ఇంటితాళాలు పగులగొట్టి కనబడటంతో మల్లేశానికి సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామానికి చేరుకున్న మల్లేశం ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో భద్రపర్చిన వెండి కడియాలు, పది తులాల వెండి బిస్కట్, మెట్టెలు, రూ.23వేల నగదు దోచుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎడ్లబండిని ఢీకొన్న లారీ

ఎద్దు మృతి- నలుగురికి గాయాలు

కోహీర్, ఫిబ్రవరి12:మండలంలోని బిలాల్‌పూర్ మదర్సా ముందున్న ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఎద్దు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.. గ్రామానికి చెందిన జర్నప్ప నరేశ్, మహేశ్, రాకేశ్‌తో కలిసి ఎడ్లబండిపై చేను నుంచి ఇంటికి వస్తుండగా మనియార్‌పల్లి వైపునకు అతివేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రూ.80వేల విలువైన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా, బండి నుజ్జునుజ్జు అయ్యింది. నలుగురికి గాయాలు కావడంతో జహీరాబాద్ దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి రైతు జర్నప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతులు నిల్.. ఫీజులు పుల్

- జోగిపేటలో ప్రైవేట్ స్కూల్స్ దందా
- అర్హత లేని సిబ్బందితో విద్యాబోధన
- కనీస వసతులు కరువు..కనిపించని ఆట స్థలాలు
- ముక్కుపిండి ఫీజులు వసూలు.. తల్లిదండ్రులకు బెదిరింపులు
- సీఆర్‌పీ అండతో రెచ్చిపోతున్న యాజమాన్యాలు

అందోల్: జోగిపేటలోని ప్రైవేట్ పాఠశాలలు

అందోల్, ఫిబ్రవరి 12: జోగిపేటలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు విద్యాబోధన మరిచి ఫీజులు పిండడంపైనే దృష్టిసారించాయి. సరైన వసతులు లేకున్నా విద్యార్థుల నుంచి ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, స్థానిక విద్యాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల దందా మూడు పూవులు..ఆరు కాయలుగా సాగుతున్నది. జోగిపేట పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఒక్కటై కొత్తగా సంఘాన్ని సైతం ఏర్పాటు చేసుకున్నాయి. కనీస అర్హతలేని సిబ్బందిని నియమించుకుని తక్కువ వేతనాలు చెల్లిస్తూ విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తూ వారి భవిష్యత్‌ను పాడుచేస్తున్నారు. ఇరుకు గదుల్లోనే బోధన కొనసాగుతున్నది. సరిపోను మూత్రశాలలు లేవు. ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో పాటు అనుమతులు లేకున్నా పెద్ద తరగతులు కొనసాగిస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఆట స్థలాలు లేవు. బస్సులో సైతం పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నా అధికారుల చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. జోగిపేట పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఓ పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం కూడా లేదు. ఇరుకు సందులో కొన్నేండ్లుగా పాఠశాల నడుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కొన్నిసార్లు ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఎంతవో తనిఖీలకు వెళ్లగా ఓ పాఠశాల యాజమాన్యం దాడి సైతం చేసింది. ఎంతవోపై దాడి జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిని బట్టి చూస్తే ప్రైవేట్ స్కూల్స్ మాఫియాగా వ్యవహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారు చెప్పనంత ఫీజు చెల్లించాల్సిందే లేదంటే దబాయింపులు.. టార్చర్ మామూలుగా ఉండదు. ఇటీవల ఈ విషయాలను ప్రశ్నించిన పలువురు తల్లిదండ్రులను కొట్టినంత పనిచేసింది ఓ పాఠశాల యాజమాన్యం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాల్సిన విద్యాశాఖ ఉద్యోగి జోగిపేటలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘానికి అధ్యక్షుడిగా ఉండడం విశేషం. ఈ ఉద్యోగి ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఎంతవో కార్యాలయంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ)గా పని చేస్తున్న వ్యక్తే ఇక్కడి ప్రైవేట్ పాఠశాలల సంఘానికి అధ్యక్షుడిగా ఉండడంతో ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజుల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీఆర్పీ తన బాధ్యతలు విస్మరించి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సేవలో తరిస్తుండడం విశేషం. విద్యాశాఖ నుంచి ప్రతినెలా రూ. 20వేల వేతనంగా తీసుకుంటూ ప్రైవేట్ పాఠశాలల బలోపేతానికి ఆయన కృషిచేస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఈ విషయంపై మండల విద్యాధికారి కృష్ణ మాట్లాడుతూ.. జోగిపేటలోని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపడుతామన్నారు. గతంలో సైతం ఓ పాఠశాలకు వెళ్లి తనిఖీలు చేస్తుండగా ఆ యాజమాన్యం దౌర్జన్యం చేసినమాట నిజమే అన్నారు. తమ శాఖలో పనిచేసి సిబ్బంది ఒకరు ప్రైవేట్ పాఠశాలల సంఘానికి అధ్యక్షుడిగా ఉండడం కరెక్ట్ కాదు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిస్తామని ఎంతవో తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

జహీరాబాద్ దవాఖానలో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న వైద్య, ఆరోగ్య విధానపరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్

జహీరాబాద్, ఫిబ్రవరి 12: వైద్యం కోసం దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ప్రాంతీయ దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలోని వైద్యాధికారులు, సిబ్బందితోపాటు రోగులకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆనంతరం దవాఖానలోని పలు వార్డులను సందర్శించి వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దవాఖాన వైద్యాధికారులతో సమావేశమైయ్యారు. దవాఖానలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దవాఖాన ఆవరణలో చేపడుతున్న మాతా, శిశు కేంద్రం పనులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేలా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ శ్రీధర్, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్, కార్యదర్శుల మధ్య వాగ్వాదం

కార్యాలయంలో ఎమ్మార్వోను ప్రశ్నిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఝరాసంగం, ఫిబ్రవరి 12: ప్రజా పాలనలో భాగంగా గ్రామసభల్లో స్వీకరించిన రేషన్ కార్డు దరఖాస్తులను స్పెడ్ సీట్లో నమోదు చేయు ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులకు, తహసీల్దార్ తిరుమలరావుకు మధ్య బుధవారం తహసీల్ కార్యాలయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామానికి ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్ దరఖాస్తులను కార్యాలయంలో సబ్మిట్ చేయలేదంటూ సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో మండల పంచాయతీ కార్యదర్శులు తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ తమపై క్రిమినల్ కేసులు నమో దు చేస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. తమకు తహసీల్దార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

జోరుగా ఎర్రమట్టి తవ్వకాలు

- అధికారుల మౌనంతో ఝరాసంగంలో మట్టి గుట్టలు మాయం
- రాత్రుల్లో వెంచర్లకు మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- మామూళ్ల తోనే అధికారుల నిఘా కరువైందంటూ ఆరోపణలు

కుప్పానగర్ శివారులో యంత్రాల సహాయంతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

ఝరాసంగం, ఫిబ్రవరి 12: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని కుప్పానగర్, పొట్టిపల్లి, కొల్లూర్, చిల్కేపల్లి గ్రామ శివార్లలో ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారుల నిఘా వైఫల్యం కారణంగా మట్టిమాఫియా విలువైన గుట్టలను కొల్లగొడుతూ కాసుల పంట పండించుకుంటున్నారు. అధికారుల సూచనల మేరకే రాత్రుల్లో, సెలవు దినాల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లలో భూములను చదును చేసి అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం ఎర్రమట్టిని ఉపయోగిస్తున్నారు. భవనాల నిర్మాణం కోసం పిల్లర్లు నిర్మించిన తర్వాత బరంతి నింపేందుకు వాడుతున్నారు. ఓవర్ లోడ్ మట్టితో భారీటిప్పర్లు తిరగడంతో రహదారులు దెబ్బతినడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాల సమీపం నుంచి వాహనాలు వెళ్తుండడంతో దుమ్ము, ధూళి కారణంగా పంటలు పాడవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తూ అధికారులు మామూళ్ల తీసుకుంటూ ఏమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు మండలంలో బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వాల్టా చట్టాన్ని అధికారులు పకడ్బందిగా అమలు చేయకుండా నిర్వీర్యం చేస్తున్నారు. సొంత భూముల్లో సైతం మట్టిని తరలించాలంటే ముందుగా రెవెన్యూ, మైనింగ్, అండర్ గ్రౌండ్ వాటర్ రిసోర్స్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతూ లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని తెలిసినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మట్టి దందాను నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

సదాశివపేట, ఫిబ్రవరి 12: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 26న సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కోటి రుద్రాక్ష లింగార్చన మహోత్సవం జరగనున్నది. ఈమేరకు బుధవారం జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి

కనులపండువగా పల్లకీ సేవ

అమ్మవారి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు

పాపన్నపేట, ఫిబ్రవరి 12: ఏడుపాయల్లో దుర్గామాత పల్లకీసేవను భక్తులు బుధవారం కనులపండువగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం చండీహోమం, ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో అర్చకులు హోమం అనంతరం ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, భక్తులు మంగళహారతులతో ముందు సాగగా దుర్గామాత నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కోహీర్, ఫిబ్రవరి12: మండలంలోని పర్సపల్లి శివారులో వెలిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య హోమం నిర్వహించారు. అనంతరం దాతలు అన్నప్రసాదం చేశారు. నేడు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామనిష భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా తల్లిదండ్రుల పూజోత్సవం

తల్లిదండ్రుల పాదాలకు పూజలు చేస్తున్న విద్యార్థులు

జిన్నారం ఫిబ్రవరి 12: జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి తల్లిదండ్రుల సామూహిక పూజోత్సవాన్ని ఆశారాంజీ బాపు ఆశ్రమం, యువ సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక నాయకులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, ఆనంద్‌కృష్ణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ఆశారాంజీ బాపు చిత్రపటానికి పాఠశాలల నిర్వాహకులతో కలిసి హారతులిచ్చి పూజించారు. అనంతరం తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ చేసి ఆశీర్వాదాలు పొందారు. పాశ్చాత్య సంస్కృతికి చెందిన వాలెంటైన్స్ డేను జరుపుకోవద్దని ప్రతిజ్ఞ చేయించారు. బొల్లారం, మల్లంపేట్, మియాపూర్, ఆర్సీపురానికి చెందిన దాదాపు 32 పాఠశాలల విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు. ముఖ్యఅతిథులుగా హాజరైన నాయకులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు హరికృష్ణారెడ్డి, ఉదయ్ భాస్కర్ రెడ్డి, సింహాచలం, యువసేవ సంఘం నిర్వాహకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

అధికారులకు సూచనలిస్తున్న టీజీఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ నందకుమార్

సదాశివపేట, ఫిబ్రవరి 12: వేసవిలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని టీజీఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ నందకుమార్ అధికారులకు సూచించారు. బుధవారం సదాశివపేట సబ్ డివిజన్ కార్యాలయంలో ఏఈలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి సర్కిల్ ఎస్ఈ శ్రీనాథ్, డీఈ సురేందర్ రెడ్డి, ఏడీఈ వీరారెడ్డి, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాల స్వీకరణ

జహీరాబాద్, ఫిబ్రవరి 12: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయా మండలాల అభివృద్ధి అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల ముసాయిదాను విడుదల చేశారు. ఆయా మండలాల్లో 365 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిపై ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. 14న కలెక్టర్‌తో ఆమోదం పొందాక, 15న మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను పరిష్కరిస్తామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఐదు జడ్పీటీసీలు, 65 ఎంపీటీసీలు, 1,90,540 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు.

మల్లికార్జున స్వామి జాతరలో బీఆర్ఎస్ నాయకుల పూజలు



అగ్నిగుండాలను దర్శించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం ఫిబ్రవరి 12: జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర బుధవారం అటహాసంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, అదర్శ్ రెడ్డి, వెంకటేశం గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నాయకులను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు గ్రామీణ జాతరలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజేశ్, మాజీ సర్పంచులు జనార్దన్, శివరాజ్, ఆంజనేయులు, నాయకులు పృథ్వీరాజ్, మణిక్ యాదవ్, భీమ్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లు దక్కేవరకు పోరాడుతాం..

రామచంద్రాపురం, ఫిబ్రవరి12:తమ ప్లాట్లు దక్కే వరకు పోరాడుతామని, ఇతరులు మా ప్లాట్లను ఆక్రమించుకోవాలని చూస్తే ఊరుకోమని కొల్లూర్ ఆనంద్‌నగర్ కాలనీవాసులు హెచ్చరించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ఆనంద్‌నగర్‌కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రమోద్ తదితరులు మాట్లాడుతూ..1986లో కొల్లూర్ గ్రామంలోని సర్వేనంబర్ 204లో ఉన్న భూమిలో ప్లాట్లు చేసి విక్రయించడంతో తామంతా అందులో ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. సుమారుగా 300మంది ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. అప్పట్లో కొల్లూర్‌లో ఏమాత్రం అభివృద్ధి లేకపోవడంతో అక్కడ ఎలాంటి నిర్మాణం చేయలేదని, ఓపెన్ ల్యాండ్‌గానే ఉండిపోయిందన్నారు. అందులో ఎలాంటి నిర్మాణాలు జరుగకపోవడంతో ఆ భూమి యజమానులు తిరిగి 2005లో మరొక్కరికి విక్రయించారన్నారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు కూడా తమకే అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పారు. గతంలో ఓఆర్ఆర్ కోసం ప్రభుత్వం భూమిని సేకరించగా అందులోనూ ప్లాట్లు అనే ఉందన్నారు. దీనిపై తామంతా న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ ప్లాట్లను కాపాడుకోవడం కోసం చిన్న పాటి నిర్మాణం చేస్తుంటే పోలీసులు తమపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లుగా ఉన్న తమ భూమిని అక్రమంగా ఇతరులు కొనుగోలు చేసి తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి పత్రాలు పరిశీలించి ప్లాట్ ఓనర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భద్రప్ప దంపతులు

చండీ హోమం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 12: మాఘ పౌర్ణిమని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు వీరభద్రస్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గటాటి భద్రప్పఉమారాణి దంపతులు, అతడి తనయుడు సంయుక్తంగా చండీహోమాన్ని నిర్వహించారు. వేదపండితులు అత్యంత వైభవంగా హోమాన్ని నిర్వహించారు. విశ్వశాంతి కోసం చండీ హోమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వీరితోపాటు ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వెలిమెలలో ప్రారంభమైన బీరప్ప స్వామి జాతర

రామచంద్రాపురం, ఫిబ్రవరి12: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో నూతనంగా నిర్మించిన కామరాతి సమేత బీరప్ప స్వామి ఆలయంలో బుధవారం నుంచి 18వ తేదీ వరకు మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఆలయ నిర్మాణ దాత కాల్వగడ్డ రాజ్‌కుమార్, గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. స్వామివారి జాతర సందర్భంగా గ్రామంలోని గొల్లకురుమలు బీరప్పలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా గురువారం ఊరెత్తడం, ఒగ్గుకథ, శుక్రవారం మైలలు తీయడం, శనివారం పాలుపట్టుట, గంగా తెప్ప, ఆదివారం గంపల ఊరేగింపు, మల్లికార్జునస్వామి కల్యాణం, అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, బండ్ల ఊరేగింపు, మల్లన్న బోనాలు, బీరప్ప మైలలు, సోమవారం బీరప్పస్వామి, కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, మంగళవారం బీర ప్ప దేవుడి నాగవెల్లి బోనాలు నిర్వహిస్తామ ని ఆలయ నిర్మాణ దాత, ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్‌కుమార్, కురుమ సం ఘం నాయకులు తెలిపారు. వేడుకల్లో భా గంగా భక్తులకు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిన్నారంలో ఘనంగా హిందూ సమ్మేశనం

జిన్నారం ఫిబ్రవరి 12: జిన్నారం మండల కేంద్రంలో హిందూ సమ్మేశనా